దెయ్యాల బండి

అపర్ణా నైటింగేల్

"క్రూ...." అంటూ ఎక్కడో దూరాన కూత వినిపించింది.

"చుక్ .... చుక్ .... చుక్ .... చుక్ ...." అంటూ దయ్యాలబండి వస్తున్న చప్పుడయింది.

ఆరేళ్ళ పసివాడు రాజు బెడ్ మీద కదిలి లేచి కూర్చున్నాడు.

దెయ్యాలబండి వస్తున్న చప్పుడు చెవులు రిక్కించి విన్నాడు.

గోడ గడియారం "టంగ్ ....టంగ్ ....టంగ్ ...." మని అప్పుడే పన్నెండు గంటలు కొట్టింది.

రాజు బెడ్ దిగి నిలబడ్డాడు.

పక్క మంచంమీద దామోదర్, కవిత గాఢనిద్రలో వున్నారు.

రాజు నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ గది తలుపు దగ్గరకు వచ్చాడు.

మూసి వున్న తలుపులు వాటికవే తెరుచుకున్నాయి.

గుమ్మంలోంచి బయటకు అడుగుపెట్టి నడవా దాకా నడుచుకుంటూ వెళ్ళాడు.

పక్కనే మెట్లు వున్నాయి.

నెమ్మదిగా మెట్లు దిగాడు.

వీధి గుమ్మం తలుపులు వాటికవే తెరుచుకున్నాయి.

బయటకు అడుగు పెట్టాడు.

ప్రహారీ గేటు సమీపించాడు.

గేటు కూడా దానికదే "కిర్రు"మంటూ తెరుచుకుంది.

రాజా ముందుకు అడుగువేశాడు.

"చుక్ .... చుక్ .... చుక్ ...." దెయ్యాలబండి చప్పుడు ఆ నిశ్శబ్ద నిశీధిలో కర్ణకఠోరంగా వినిపిస్తోంది.

చుట్టూ గాఢాంధకారం.... జేబురు జేబురుగా పెరిగిన వృక్షసంపద గాలికి భీమూతాల్లా తలలాడిస్తున్నాయి.

కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి....

సమీపంలో వున్న రైలు కట్టవైపు నడక సాగించాడు రాజా.

"చుక్ .... చుక్ ..." దెయ్యాలబండి దగ్గరవుతోంది.

రైలుకట్ట ఎక్కి పక్కగా నిలబడ్డాడు.

కట్టకు అవలివైపున శ్మశానం!

కనుచూపుమేర దాకా సమాధులు.... అక్కడక్కడ కాష్టాలు కాలుతున్నాయి. చీకట్లో చితి నెగళ్ళు నింగికి ఎగుస్తున్నాయి.... ఎర్రటి జ్వాలలు ఆ ప్రదేశాన్ని భయంగొలుపుతున్నాయి.... అక్కడి చెట్లు జడల భూతాల్లా తలలూపుతున్నాయి గాలికి.

"చుక్ .... చుక్ .... చుక్ .... చుక్ ...." దయ్యాలబండి బాగా దగ్గరయింది.

హెడ్ లైటు వెలుతురులో నల్లని బొగ్గు యింజను మరింత నల్లగా నిప్పురవ్వలతో దట్టమైన పొగ వదులుతూ రాక్షసిలా వస్తోంది.

ఆ వెనకనే కంపార్టుమెంట్లున్నాయి.

"టక....టక....టక....టక...." మంటూ చక్రాలు చప్పుడు చేసుకుంటూ రైలుకట్ట పక్క నిలబడ్డ రాజు పక్క నుంచి ముందుకు దూసుకుంటూ వెళ్ళిపోయింది దెయ్యాలబండి.

ఆఖరి కంపార్టుమెంట్ వెనక రెడ్‌లైట్ ఎర్రటి మంటలా కనిపిస్తోంది.

అది క్రమక్రమంగా కనుమరుగవుతోంది.

రాజు దీక్షగా అదే చూస్తూ నిలబడ్డాడు.

అదే సమయంలో___

బంగళా బెడ్ రూమ్‌లో కవితకు హఠాత్తుగా మెళకువ వచ్చింది.

ప్రక్కకు తిరిగి చూసింది.

రాజు బెడ్ ఖాళీగా వుంది.

'బాబు యెక్కడికెళ్ళాడు?' అని అనుకుంది.

లేచి గది బయటకు వచ్చింది.

పక్కనే వున్న బాత్ రూమ్‌లోకి తొంగి చూసింది.

బాత్ రూమ్ ఖాళీగా వుంది.

ఆమె కంగారుపడింది.

మేడ మెట్లు దిగి చూసింది.

బంగళా గుమ్మం తలుపులు, ప్రహారీ గేటు బార్లా తెరిచి వున్నాయి.

'రాజు ఎక్కడికెళ్ళాడు?' గాబరాగా అనుకుంది మళ్ళీ.

ఆ సమయంలో ఆమెకు రెండురోజుల కిందట జరిగిన సంఘటన గుర్తొచ్చింది.

ఆ రోజు రాత్రి రాజు తనను నిద్రలేపాడు.

ఆ సమయంలో దూరాన ట్రైన్ కూతతోపాటు దెయ్యాలబండి వస్తున్న చప్పుడయింది.

"అమ్మా! ఇంత రాత్రిపూట వస్తోంది కదా! ఆ ట్రైన్ యే ఊరెళుతోందమ్మా?" అని అడిగాడు రాజు.

"విజయవాడ వెళుతోందమ్మా!" అని చెప్పింది కవిత.

"ఒకసారి డాడీ, నువ్వు, నేను ఢిల్లీ వెళుతున్నప్పుడు రైళ్ళకి పేర్లుంటాయని, దాని పేరు రాజధాని ఎక్స్‌ప్రెస్ అని చెప్పావు కదా! మరి ఇప్పుడు వస్తోన్న ఈ ట్రెయిన్ పేరేంటి?" అని అడిగాడు.

"దీనిని అంతా దెయ్యాలబండి అని పిలుస్తారు. అర్ధరాత్రి తరువాత ఈ ఊళ్ళోంచి వెళుతుందని, ఈ ట్రెయిన్‌ని అంతా అలాగే పిలుస్తారు" అని చెప్పిందామె.

"అయితే ఆ దెయ్యాలబండిని నాకు చూడాలనుందమ్మా!" అన్నాడు.

"వద్దు బాబూ! రాత్రుళ్ళు చిన్న పిల్లలు యెక్కడికీ వెళ్ళకూడదు. జడుసుకుంటారు" అంది.

"ప్లీజ్ నువ్వూ తోడు రామ్మా! ఆ ట్రెయిన్ చూద్దాం!!" అన్నాడు.

"నేను కూడా వచ్చినా నువ్వు ఆ చీకటిని చూసి జడుసుకుంటావు. వద్దు, మరోసారి యెప్పుడైనా చూపిస్తాన్లే!" అంది.

ఆ తరువాత రాజు కళ్ళు మూసుకుని పడుకున్నాడు.

మర్నాడు కూడ అలాగే దెయ్యాలబండి వచ్చే సమ

యానికి తనని నిద్రలేపి "ఆ ట్రెయిన్ చూద్దాం పదమ్మా!" అని అడిగాడు మళ్ళీ.

ఆమె ఆ సమయానికి ఏదో సమాధానం చెప్పి రాజాని నిద్రపుచ్చింది.

కాని—

ఇప్పుడు ఆమె లేచి చూస్తే రాజా లేడు.

బంగళా తలుపులు తెరిచి వున్నాయి.

అంటే ....

అంటే ....

రాజా ఇప్పుడా రైలుకట్ట దగ్గరకు ఒంటరిగా వెళ్ళా డన్నమాట!

అంతే!

ఆమె హృదయం భయంతో తల్లడిల్లిపోయింది.

బెడ్ రూమ్‌లోకి వెళ్ళి దామోదర్‌ని నిద్రలేపింది.

"మనబ్బాయి కనిపించడంలేదు దామూ!" అంటూ— రాజా యొక్కడికి వెళ్ళి వుంటాడో తన అనుమానం వివ రించి చెప్పింది.

దామోదర్ దిగ్గున మంచంమీంచి లేచాడు.

ఇద్దరు వడివడిగా సమీపంలో వున్న రైలుకట్టవైపు పరుగుతీశారు.

వాళ్ళు రైలు కట్ట సమీపించేసరికి—

అక్కడ రాజా ఒంటరిగా నిలబడి వున్నాడు.

కవిత రాజాని దగ్గరకు తీసుకుంది.

"ఇక్కడేం చేస్తున్నావు బాబూ!? రాత్రిపూట ఇలా ఒంటరిగా రావచ్చా!? తప్పుకదూ?!" అంది కవిత.

"మరి రెయ్యాలబండి చూస్తానంటే వద్దన్నావ్‌గా! నిన్న చూపించమంటే చూపించనన్నావ్‌గా! అందుకే

నేనొక్కర్నే చూడాలని వచ్చాను" నవ్వుతూ చెప్పాడు రాజు.

"చాలు....చాల్లే ...ఇంకెప్పుడూ ఇలా రాత్రుళ్ళు ఒంటరిగా రాకు! పద ఇంటికి పోదాం!" అంటూ కసి రాడు దామోదర్.

ముగ్గురూ రైలుకట్ట దిగారు.

రాజు హఠాత్తుగా వెనక్కు తిరిగి రైలుకట్ట అవతలివైపు వున్న శ్మశానం వైపు చూసి టాటా చెప్పాడు.

"ఏమిటి రాజా? ఎవరికి టాటా చెబుతున్నావ్?" అడిగాడు దామోదర్.

"డాడీ! అక్కడ చెట్లమీద యేవో తెల్లని ఆకారాలు కనిపిస్తున్నాయి, అవి నన్ను చూసి చేతులు ఊపుతున్నాయి" చెప్పాడు రాజు.

ఆ మాటలకు దామోదరం, కవితల గుండెలు జల్లుమన్నాయి.

కాళ్ళు వణికాయి.

భయం భయంగా వెనక్కి తిరిగి చూశారు.

వాళ్ళకి యేమీ కనిపించలేదు.

"వట్టిది బాబూ! అక్కడెవరూ లేరు. నువ్వు భ్రమ పడుతున్నావంతే!" అంది కవిత.

రాజు తల్లి వంక తండ్రి వంక అదోలా చూశాడు.

వంకరగా నవ్వి ఊరుకున్నాడు.

ఆ బాలుని నవ్వు కవితకు భయం గొలిపింది.

కుర్రాడిని మరింత దగ్గరగా పొదివి పట్టుకుంది.

వేగంగా అడుగులు వేస్తూ బంగళాకి తిరిగివచ్చేశారు.

రాజుని మంచంమీద పడుకోబెట్టింది కవిత.

వెంటనే నిద్రలోకి జారిపోయాడు రాజు.

"దామూ! మనబ్బాయి మాటలనుబట్టి బాబుకి ఏదో గాలి సోకి వుంటుందని నా అనుమానం" అంది కవిత.

"అవును నాకూ అదే అనుమానంగా వుంది" అన్నాడు దామోదర్.

"ఎవరైనా కోయదొరని పిలిచి చూపిద్దాం" అంది కవిత.

"అలాగే! ఇక పడుకో" అని అంటూనే నిద్రలోకి ఒరిగిపోయాడు దామోదర్.

కవిత కూడ నిద్ర కుపక్రమించింది.

ఆ మర్నాడు—

దామోదర్ ఓ కోయదొరను వెంటబెట్టుకుని వచ్చి రాజాను చూపించాడు.

ఆ కోయవాడు బాలుడిని పరీక్షించి—

"మీ అనుమానం నిజమే! గాలి సోకింది. తావీదు కడతాను" అని రాజాకి తాయెత్తు ఒకటి కట్టాడు.

2

దామోదర్, కవితలు వుంటున్న బంగళా వూరికి దూరంగా వుంటుంది.

ఊరికి, ఆ బంగళాకి సంబంధాలు కలపడానికి దామోదర్—రాజా కవిత కడుపులో వుండగా జీపు ఒకటి కొన్నాడు.

రాజా కాన్వెంట్‌లో సెకండ్ స్టాండర్డ్ చదువుతున్నాడు.

దామోదర్‌కి ఊళ్ళో ఓ ప్రముఖ టెక్స్‌టైల్ దుకాణం వుంది.

అతను ఉదయమే షాపుకి వెళ్ళేటప్పుడు కొడుకు రాజాని జీపులో తనతోకూడా తీసుకువెళ్ళి కాన్వెంట్

దగ్గర దిగబెడతాడు. సాయంత్రం షాపుని మేనేజర్ కి అప్పజెప్పి రాజాని కాన్వెంట్ దగ్గర పికప్ చేసుకుని, ఇంటి దగ్గర దించేసి తను మళ్ళీ జీపులో షాపుకి వెళ్ళిపోతాడు. మళ్ళీ రాత్రి పదిగంటలకే తిరిగి వస్తాడు.

ఆ రోజు ఉదయం రాజు దామోదర్ జీపులో వెళ్ళి సాయంత్రం తిరిగి వచ్చేశాడు.

కవిత వంట గదిలో టిఫిన్ తయారుచేస్తోంది.

రాజు బంగళా ఆవరణలో అటూ ఇటూ తిరుగుతున్నాడు.

ఆ పసివాని మెదడు యేదో దీర్ఘంగా ఆలోచిస్తోంది.

తనలోతనే విచిత్రంగా నవ్వుకుంటున్నాడు.

కళ్ళల్లో యేదో తెలియని క్రౌర్యం తొణికిసలాడుతోంది.

ఆ సమయంలో బంగళా ప్రహరీ గోడమీంచి పొడవాటి పెద్ద నాగుపాము ఒకటి బుసకొడుతూ క్రిందికి దిగింది.

రాజు దృష్టి దానిమీద నిలిచింది.

చెంగున దాని దగ్గరకు పరిగెట్టుకెళ్ళాడు.

చరచరా పాక్కుంటూ పోతోంది నాగు.

చురుగ్గా ఎడమచేత్తో దాని తోక పట్టుకొని పైకి లేపాడు.

"బుస్"మంటూ బుసకొట్టి ఆ బాలుని చేతిలో మెలికలు తిరుగుతూ ఆడసాగింది పాము.

రాజు దానిని తోక దగ్గర అలాగే పట్టుకుని బంగళా మెట్లెక్కి పైకి వెళ్ళాడు.

పాము రాజు చేతిలో ఐదారు మెలికలుగా చుట్టుకుపోయింది.

వంట గదిలోకి ప్రవేశించాడు రాజా.

కవిత అటు తిరిగి వంట చేసుకుంటోంది.

"మమ్మీ!" చిన్నగా పిలిచాడు రాజా.

"ఏం బాబూ!?" అంటూ వెనుదిరిగిన కవిత కొడుకు చేతిలో పామును చూసి "కెవ్వు"మని కేక వేసింది.

రాజా చిరునవ్వు నవ్వుతున్నాడు.

"బాబూ! రాజా! అది పాము. దానిని అలా పట్టుకో కూడదు వదిలెయ్" అంది కంగారు పడుతూ.

"ఏం మమ్మీ!? పాముని పట్టుకుంటే ఏమౌతుంది?" అమాయకంగా అడిగాడు.

"అది విషపురుగు. దానికి విషం వుంటుంది. అది కాటేస్తే చచ్చిపోతారు. తొందరగా దాన్ని వదిలేయ్!" అంది ఆత్రతగా.

రాజా ఆ నాగుని వదల్లేదు.

పైగా—

అదోలా నవ్వాడు.

"పాముకి ఒళ్ళంతా విషం వుంటుందామ్మా?!" అని అడిగాడు.

"లేదు బాబూ! దానికి కోరల్లోనే వుంటుంది విషం. ఆ కోరలతో అది కాటేస్తే వెంటనే నురగలు కక్కుకుని చచ్చిపోతారు" కంగారు పెట్టింది కవిత.

ఆమె ముఖంలో భీతి స్పష్టంగా తొంగిచూస్తోంది.

రాజా మళ్ళీ నవ్వాడు.

"మమ్మీ! పాముకి కోరల్లోనే విషం వుంటుందని, కాని మనిషికి నిలువెల్లా విషమేనని టీచర్ చెప్పారు. నిజమేనా?!" అడిగాడు అదోలా నవ్వుతూ.

ఆమె ఆ మాటకు సమాధానం చెప్పలేకపోయింది.

కాని ఎక్కడో మారుమూలల్లో మనస్సు గతుక్కుమంది.

"బాబూ! ఆ మాటలన్నీ తరువాత మాట్లాడుదువు గాని. ముందు పాముని వదిలిపెట్టు. నీకు పుణ్యం వుంటుంది" బతిమాలిందామె.

రాజా ఈసారి పకపక నవ్వాడు.

కేరింతలు కొడుతూ—

"ఈ పాముతో నాకు ఆడుకోవాలనుంది మమ్మీ! పసిపిల్లలను విషజీవులు, క్రూర జంతువులు ఏమీ అనవట! వాళ్ళలో దేవుడుంటాడట! మా టీచరు చెప్పారు. అందుకే ఈ పాము నన్ను కాటు వెయ్యడంలేదు. మరి దీనిని బయటికి తీసుకెళ్ళి ఆడుకోనా?" అని అడిగాడు.

కవిత వణికిపోయింది.

ఆ తల్లి హృదయం తల్లడిల్లిపోతోంది.

నాగు పడగవిప్పి ఆ పిల్లవాని చేతిని "బుస్స్.... బుస్స్...." మంటూ కాటు వేయబోతూనే మళ్ళీ పడగని వెనక్కి తీసుకుంటోంది.

"రాజా! దయచేసి దాన్ని వదిలేయ్! దాన్ని చూస్తూంటే నాకు భయంవేస్తోంది" అంది.

"నన్నేమీ చెయ్యని పాము నిన్నేంచేస్తుందమ్మా?! కావాలంటే నువ్వూ పట్టుకుని చూడు" అంటూ అడుగులు ముందుకు వేశాడు.

రాజా ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తుంటే కవిత గజగజ వణికిపోసాగింది.

ఆమెకు నోట మాట రావడంలేదు.

మరో అడుగు వేస్తే రాజా ఆమెకు బాగా దగ్గరవుతాడు. ఆ బాలుని చేతిలోని పాము ఆమెని తాకుతుంది.

అంతే!

కవిత కళ్ళు తిరిగి పడిపోయింది.

మరో పదినిమిషాలు గడిచాక ఆమె కళ్ళు తెరిచింది.

రాజా నవ్వుతూ ఆమె పక్కన కూర్చుని వున్నాడు.

"ప....ప....పా ...ము...." అందామె ఖంగారుగా.

"వదిలేశానమ్మా! నువ్వు భయపడ్డావని దానిని బయట పారేసి వచ్చాను" చెప్పాడు రాజా.

ఆ మాటతో కవిత మనసు కుదుటపడింది.

"అమ్మయ్యా!" అని తృప్తిగా గాలి పీల్చుకుంది.

"బాలూ! నీకు మమ్మీమీద నిజంగా ప్రేమవుంటే ఇం కెప్పుడూ పాము జోలికి వెళ్ళనని, దానిని పట్టుకుని ఆడుకోనని మాటియ్యి" అంది రాజాని దగ్గరగా తీసుకుంటూ.

"అలాగే మమ్మీ!" అంటూ అమాయకంగా నవ్వాడు రాజా.

ఆ రాత్రి దామోదర్ షాపునుంచి తిరిగి రాగానే—

రాజా పాముని పట్టుకొని వచ్చి తనతో మాట్లాడిన సంభాషణ పూర్తిగా పూసగుచ్చినట్టుగా వివరించి చెప్పింది కవిత.

దామోదర్ తలపంకించి యేదో ఆలోచిస్తూండి పోయాడు.

"వాడు పాముతో ఆడుకొన్నా వాడి అదృష్టం బాగుండి పాము యేమీ చెయ్యలేదు. రేపు మరో పాముతో ఆడుకుంటే అదీ కాటు వెయ్యకుండా వుంటుందా? దీనికి కారణం ఆ టీచరే! టీచర్ చెప్పిన మాటల ప్రభావం మన రాజామీద బాగా పనిచేసి వుంటుంది! రేపు టీచర్‌తో మాట్లాడి అలాంటి మాటలు పసిపిల్లలకు బోధించవద్దని చెబుతాను" అన్నాడు దామోదర్.

జీప్ కాన్వెంట్ ముందాగింది.

అందులోంచి దామోదర్, రాజూలు దిగారు.

స్కూల్ బుక్స్ ఓ చేత్తో పట్టుకొని, మరో చేతితో దామోదర్ చిటికెన వ్రేలు అంచు పట్టుకొని లోపలికి అడుగు పెట్టాడు రాజా.

"గుడ్ మార్నింగ్ టీచర్!" అని టీచర్ ని విష్ చేసి, తండ్రి చెయ్యి వదిలి పెట్టి తన సీట్లోకి వెళ్ళి కూర్చున్నాడు.

టీచర్ దామోదర్ ని చూసి "గుడ్ మార్నింగ్ సర్! కమిన్!" అంది కుర్చీలోంచి లేచి నిలబడి వినయంగా.

"గుడ్ మార్నింగ్" తను కూడా విష్ చేసి దగ్గరగా వెళ్ళాడు దామోదర్.

"రాజు నా కొడుకు" చెప్పాడతను.

"ఐనో! రోజూ మీరు రాజుని కాన్వెంట్ గేటు ముందు జీప్ లో డ్రాప్ చేయడం చూస్తూంటాను నేను" అంది టీచర్.

"చూడండి టీచర్! నేను మిమ్మల్నొక విషయం అడగాలని వచ్చాను!" అన్నాడు దామోదర్ సంభాషణకు నాందిగా.

"చెప్పండి" అంది టీచర్.

"విషజీవులు, క్రూరజంతువులు చిన్నపిల్లలని యేమీ చెయ్యవని మీరు పిల్లలకు బోధించారా?" అడిగాడు.

"అవును చెప్పాను" అంది టీచర్.

"అలా ఎందుకు చెప్పారు?"

"చందమామ కథ ఒకటి పిల్లలకు చెప్పాను. ఆ కథలో ఓ పసిపిల్లవాడు చిన్నతనంలో నే ఓ అడవిలో తప్పిపోతాడు. అప్పుడా బాలుడిని ఆ అడవిలోని క్రూర

మృగాలు, సాధుజంతువులు అన్నీ కలిసి పెంచి పెద్ద చేస్తాయి. ఉగ్రవాడు పాములతో ఆడుకునేవాడని, పులులు, సింహాలమీద స్వారీ చేసేవాడనీ చెప్పాను. ఆ సందర్భంలో కథ చెబుతూ పసిపిల్లల్లో దేవుడుంటాడని, వాళ్ళని విషజీవులు, క్రూరమృగాలు ఏమీ చెయ్యవని చెప్పాను" అంటూ వివరించింది టీచర్.

"కాని, అది కాకమ్మ కథ.... జీవితం కాదు.... మీ రలాంటి కథలు చెప్పడంవల్ల చిన్న పిల్లలపై వాటి ప్రభావం యెలా పడుతుందో మీకు తెలుసా?" అడిగాడు తీవ్రంగా.

"వాళ్ళలో సాహసం వస్తుంది. ఉత్సాహం పెరుగు తుంది. అందుకే నేను పిల్లలకు అలాంటి సాహస కథలు చెబుతూంటాను" అంది టీచర్.

"మీరు చెప్పే కథలు వాళ్ళలో ఉత్సాహాన్ని పెంచితే ఫరవాలేదు. కాని సాహసం పెంచితే కష్టం. ఆ కథ ప్రభావంవల్ల మా రాజు యేంచేశాడో మీకు తెలుసా?" కోపంగా అడిగాడు.

"ఏం చేశాడు?" అంది టీచర్.

"మా బంగళా ఆవరణలో ఓ విషనాగుని పట్టుకుని, వాడి మమ్మీ దగ్గరకు పట్టుకెళ్ళి, దాంతో ఆడుకుంటానని అన్నాడట! ఆమె కంగారుపడి భయంతో వదిలేయమని ఎంత బతిమాలినా వినలేదట! పైగా పిల్లల్లో దేవుడుంటా డని, వారిని విషజీవులు, క్రూరమృగాలు ఏమి చెయ్యవని టీచర్ చెప్పారని అన్నాడట?" చెప్పాడు దామోదర్.

"ఈజిట్!?" ఆశ్చర్యపోయింది టీచర్.

"అవును" అన్నాడు దామోదర్.

"పిల్లల్లో ధైర్యసాహసాలు పెరుగుతాయనే మే

మలాంటి కథలు చెబుతాం తప్ప వాళ్ళు అలాగే చేస్తారని మే మనుకోం కదా!" అంది టీచర్.

"ఏది ఏమైనా మీ రలాంటి నాయనమ్మ కథలు పిల్లలకు చెప్పకండి. ఉన్నది వున్నట్టుగా పిల్లలకు బోధ పరచండి. పాము కాటేస్తే చచ్చిపోతారని చెప్పండి. అలాగే పులులు, సింహాలు మొదలగు క్రూరమృగాలు పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరినీ చంపి రక్తం తాగుతాయని చెప్పండి. అలా చెబితే పిల్లలకు భయం కలిగి ఇలాంటి వాటి జోలికి వెళ్ళరు. మీరు చెప్పిన ఆ కథవల్ల మా రాజు మళ్ళీ మరో పాముని పట్టుకని ఆడుకుంటాడేమోనని భయం వేస్తోంది మాకు" కాస్త తీవ్రంగా అన్నాడు దామోదర్.

టీచర్ మాట్లాడలేదు. మౌనంగా వుండిపోయింది.

దామోదర్ ఆమెను మరోసారి హెచ్చరించి అక్కడి నుంచి నిష్క్రమించాడు.

4

"కూ...." దూరాన కూత వినిపించింది.

"చుక్ ....చుక్ ....చుక్ ... చుక్ ...." దయ్యాల బండి వస్తున్న చప్పుడు వినిపిస్తోంది.

"టింగ్ ....టింగ్ ....టింగ్ ...." గోడ గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

దామోదర్ బెడ్ మీద కదిలాడు.

బద్ధకంగా లేచి నిలబడ్డాడు.

బాత్‌రూమ్ వైపు అడుగులు వేశాడు.

అక్కడ రాజు నిలబడి వున్నాడు.

"ఇక్కడేం చేస్తున్నావ్ రాజూ?" అడిగాడు దామోదర్.

రాజు మాట్లాడలేదు.

తదేకంగా దామోదర్ నే చూస్తూండిపోయాడు.

"మాట్లాడవేం రాజూ?" అన్నాడు దామోదర్.

రాజు వికృతంగా నోరు తెరిచి నవ్వాడు. నోటిలో నాలుగువైపులా కోరలు మొలుచుకొచ్చాయి. కనుగుడ్లు బయటకు వెళ్ళుకొచ్చి గోళాల్లా మండుతున్నాయ్.

"హీ....హీ....హీ....హీ...." అని నవ్వుతూ కుడి చెయ్యి ముందుకు జాపాడు.

ఆ చెయ్యి పొడుపుగా సాగుతోంది.

దామోదర్ భయభ్రాంతుడయ్యాడు.

నిలువెల్లా వణికిపోసాగాడు.

భయంతో అతని రక్తనాళాలు చల్లగా అయిపోతున్నాయి.

ఒళ్ళు జలదరిస్తోంది.

ఆ ప్రదేశం నుండి పారిపోవాలనుకుని కూడ కదలలేక పోతున్నాడతను.

రాజు చెయ్యి అతని ముఖానికి దగ్గరగా వచ్చింది.

రాజు అరచేయి దామోదర్ ముఖం దగ్గరికి వచ్చి పెద్దదిగా పెరిగింది. అతని ముఖాన్ని చేతిలో ఇముడ్చుకోబోయింది.

అప్పుడు వచ్చింది దామోదర్ కి యెక్కడలేని బలమూ!

"దెయ్యం బాబోయ్!" అని పెద్దగా గావుకేక పెట్టి శక్తికొద్దీ గదిలోకి పరుగుతీశాడు.

ఆ కేకకు గదిలోవున్న కవిత ఉలిక్కిపడి నిద్ర లేచింది.

దామోదర్ గదిలో కొచ్చి, తలుపు గడియ పెట్టి,

కవితమీద వాలిపోయి, ఆమెను గట్టిగా పట్టుకుని గజగజా వణికిపోసాగాడు.

"ఏమిటి దామూ!? ఏమయింది?" కంగారుగా అడిగింది కవిత.

"దె.... దె.... దెయ్యం" అన్నాడు తడబడుతూ.

"ఎక్కడ?" మరింత కంగారుగా అడిగిందామె.

"బాత్ రూమ్ దగ్గర రాజు దెయ్యంలా కనపడ్డాడు" అంటూ రాజు తనకి యెలా కనిపించినదీ వివరించి చెప్పాడు.

"ఛ! మనబ్బాయి అలా కనిపించడమేమిటి దామూ!? ఎవరన్నా వింటే నవ్వుతారు. నీదంతా వట్టి భ్రమ అయ్యుండొచ్చు" అంది కవిత.

"భ్రమ కాదు కవితా! యిది నిజం. నా కళ్ళారా చూశాను. నోట్లో నాలుగువైపులా మొలుచుకొచ్చిన ఆ కోరలు.... బయటికి వెళ్ళుకొచ్చి ఎర్రగా జ్వాలల్లా మండుతున్న ఆ కనుగుడ్లు ...పొడవుగా సాగుతూ నావైపు దూసుకొచ్చిన ఆ కుడిచేయి... నా ముఖానికి దగ్గరగా వచ్చి, వెడల్పుగా విచ్చుకున్న ఆ అరచేయి.... అబ్బ! ఆ దృశ్యం తలుచుకుంటూంటే ఇప్పటికీ నాకు ముచ్చెమటలు పోస్తున్నాయ్" అంటూ ఇంకా గజగజ వణికిపోసాగాడు దామోదర్.

కవిత ఆలోచనలో పడింది.

ఆ ఆలోచనలో ఆమెకో వూహ తట్టింది.

"ఓహో! అలా అయివుండవచ్చు" అని అనుకుంది సగర్వంగా.

"ఏమిటి అలా అయివుండడం?" అయోమయంగా

అడిగాడు దామోదర్.

కవిత కిలకిలా నవ్వింది.

"నా పిచ్చి దామూ!" అంటూ ప్రేమగా అతని ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని ముద్దుపెట్టుకుంది.

"నువ్వు నిన్న మాట్నీ సినిమాకు వెళ్ళావు కదూ?" అడిగింది కవిత.

"అవును."

"ఆ సినిమా పేరేంటి?"

"ఈవిల్ డెడ్."

"అది హార్రర్ పిక్చర్ అని నువ్వే చెప్పావ్ గా! అందులో హీరో దెయ్యాన్ని గొడ్డళ్ళతో నరికినా దాని, శరీర భాగాలు మళ్ళీ మళ్ళీ అతుక్కుపోతూంటాయని నరకబడ్డ దాని చేతులు ఎగిరొచ్చి హీరోని గట్టిగా పట్టుకుని రక్తం వచ్చేలా రక్కేశాయని, నిజంగా ఆ సినిమా చూస్తూంటే భయంతో హడలిపోయానని, ఆ దృశ్యం యింకా నీ కళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తూ ఒళ్ళు జలదరిస్తోందని చెప్పావు. గుర్తుందా?" అడిగింది కవిత.

"అవును. చెప్పాను" అన్నాడు దామోదర్.

"మనం ఏదైనా వస్తువుని కాని దృశ్యాన్ని కాని చూసి విపరీతంగా చలిస్తే వాటి తాలూకు ప్రభావం మన మనసులమీద పనిచేసి, ఆ వస్తువులు దృశ్యాలు మన కళ్ళ ముందు నిజంగానే కనిపిస్తాయి. అది మనసుపడే భ్రమ. అంతే! ఆ సినిమాలోని భయంకర దృశ్యాలే నీ మదిలో మెదులుతున్నాయి. నువ్వు బాత్ రూమ్ కి వెళుతున్నప్పుడు ఆ సినిమా దృశ్యాలని తలుచుకుంటూ భయపడుతూనే వెళ్ళుంటావు. అవునా?"

అవును. నిజమే! తను బాత్ రూమ్ కి వెళుతున్నప్పుడు

"ఈవిల్ డెడ్" సినిమా దృశ్యాలే తన మదిలో మెదులు తున్నాయి. భయపడుతూ నే బాత్‌రూమ్‌వైపు అడుగులు వేశాడు తను. ఆ సమయంలో రాజాని అక్కడ చూసి దెయ్యంలా భ్రమపడి భయపడి వుంటాడు తను. కవిత చెప్పిందే నిజం! తన మానసిక భ్రమే తనని భయ పెట్టింది! కేవలం తన వూహే తనని ఆందోళనపరిచింది.... అని అనుకున్నాడు దామోదర్.

"నిజం కవితా! నీ వన్నది నిజం. ఆ సమయంలో 'ఈవిల్ డెడ్' సినిమా దృశ్యాలే నా మదిలో మెది లాయి. బహుశా రాజాని చూసి నేనలా భ్రమపడి వుంటా నంతే!" అన్నాడు దామోదర్.

అతని మనసు కుదటపడింది.

"నే చెప్పలేదూ! నీదంతా భ్రమని.... రా! రాజాని చూద్దాం" ఆమె బాత్‌రూమ్‌వైపు అడుగులు వేసింది.

దామోదర్ ఆమెను అనుసరించాడు.

అక్కడ—

బాత్‌రూమ్ తలుపులు తెరుచుకుని రాజా బయటకు వస్తున్నాడు.

ఆ బాలుని వదనం ప్రశాంతంగా వుంది.

కళ్ళు నిర్మలంగా వున్నాయి.

తల్లిని చూసి చిరునవ్వు నవ్వాడు.

"ఇక్కడేం చేస్తున్నావ్ రాజా?" ఆ ప్రశ్నకు సమాధానం తెలిసి కూడా అడిగిందామె.

"బాత్‌రూమ్‌కి వెళ్ళాను మమ్మీ!" చెప్పాడు రాజా.

"ఇందాక డాడీ వచ్చినప్పుడు కూడ యిక్కడే ఉన్నావు కదూ!"

"అవును మమ్మీ! నేను బాత్ రూమ్కి వెళుతున్నాను. అప్పుడే డాడీ కూడ వచ్చారు. డాడికి అర్జెంట్ ఏమో నని నేను తలుపుదగ్గరే ఆగిపోయాను. కాని, డాడీ నన్ను చూసి భయపడినట్టుగా ఎందుకో వెనక్కు పరిగెట్టు కుంటూ వెళ్ళిపోయారు" అని చెప్పి "ఏం డాడీ!? బాత్ రూమ్కి వచ్చి అలా ఎందుకు గదిలోకి పరిగెత్తి వెళ్ళి పోయారు?" అంటూ తండ్రిని అడిగాడు.

రాజా ముఖం అమాయకంగా వుంది.

ముఖంలో ఎక్కడా ఇందాకటి వికృత్వం యే కోశానా కానరాలేదు.

ఇది నిస్సందేహంగా తన భ్రమే!

పూర్తి నమ్మకం కలిగింది దామోదర్కు.

"ఊరికే అలా పరిగెట్టానంతే! ఏంలేదు" అన్నాడు దామోదర్ తృప్తిగా నవ్వుతూ.

5

జూలోంచి మూడురోజుల క్రితం వున్న నల్ల చిరుత ఒకటి బోనులోంచి తప్పించుకుపోయింది.

అది సమీపంలోనే వున్న కొండలమీదికి పారిపోయి ఉంటుందని అధికారుల భావన.

జూ అధికారులు ఆ నల్లచిరుతను ఆఫ్రికా నుండి తెప్పించారు.

అది నల్లగా ఉంటుంది. దాని ఎత్తు మూడడుగులు. పొడవు నాలుగడుగులు వుంటుంది. కళ్ళు ఎర్రగా చింత నిప్పుల్లా ఉంటాయి. అది "గాండ్రు" మని అరిచిందంటే చూపరుల గుండెలు దాని అరపులకు దడదడ లాడుతూ భయంతో అదురుతాయి. అది బోనులో ఉన్నప్పుడు చిన్నపిల్లలు దానిని చూడటానికే జడిసి వాళ్ళ తల్లి

దండ్రుల వెనుక దాక్కునేవారు.

ఆ నల్ల చిరుత మెరుపువేగంతో కన్నుమూసి తెరిచే లోగా శత్రువుమీద దాడిచేసే లాఘవం కలది. ఎంత పెద్ద చెట్టునైనా అమాంతంగా పిల్లిలా ఎక్కి ఛెంగున దూకేయగలదు.

అది తప్పించుకుపోయిన మరుక్షణమే జూ అధికారుల గుండెల్లో రాయిపడింది.

ఒకప్పుడు ఆ జూకి సమీపంలో ఉండే కొండమీద పులులు, సింహాలు, ఎలుగుబంట్లు, దుమ్ములగొండులు మొదలైన క్రూరమృగాలుండేవి.

ఆ సమయంలో అక్కడ ఊరు వెలిసింది.

జనాలు పెరిగారు.

వేటగాళ్ళు వచ్చి వాటినన్నిటినీ వధించేశారు.

చాలా ఏళ్ళు గడిచాయి.

ఊరు బాగా అభివృద్ధి చెందింది.

ఇప్పుడా కొండమీద మచ్చుకి ఒక్క క్రూరమృగం కూడా కానరాదు. కేవలం నక్కలుమాత్రమే ఆ కొండలో కాపురముంటున్నాయి. అవి అయినా పగలు యెవరికీ కనిపించవు. ఏ చెట్ల పొదలమాటునో నక్కివుంటాయి. రాత్రయ్యేసరికి ఆ పొదలలోంచి బయటికి వచ్చి కొండ మీద యథేచ్ఛగా సంచరిస్తూ కిందికి దిగివస్తాయి. కొండ దిగువున కట్టబడివున్న యిళ్ళ చుట్టుపక్కల తిరుగుతూ లోపలికి జొరబడి యిళ్ళలో వాళ్ళు పెంచుకునే కోళ్లు, పావురాలు మొదలగువాటిని ఎత్తుకుపోతుంటాయి.

పశువుల కాపరులు పశువులమందలను కొండమీదికి మేతకు తోలుకుపోయి, సాయంకాలందాకా వాటిని మేపుకొని, చీకటిపడే సమయానికి ఆ మందలని దిగువకు

తోలుకువచ్చేస్తారు. పశువులను నక్కలవాత పడకుండా జాగ్రత్తగా వాటిని కర్రలతో కాపలా కాసుకుంటారు.

ఇప్పుడా కొండ అంటే ఆ వూళ్ళోవాళ్ళకు ఎలాంటి భయమూ లేదు. ఆ కొండ నిడివి దాదాపు వూరు పొడవు మించి వుంటుంది.

కొండమీదికి తప్పించుకొని పోయిన నల్లపులి ఏ క్షణంలోనైనా వూళ్ళోకి ప్రవేశిస్తుందేమోనని జా అధికారుల భయం.

పశువుల కాపరులను కొండమీదికి వెళ్ళొద్దని, వూళ్ళో ప్రజలని అప్రమత్తంగా వుండమని మైకుల ద్వారా హెచ్చరించి పేపర్లలో ప్రకటించారు.

పులికోసం కొండమీద పోలీసులు, వేటగాళ్ళు తీవ్రంగా గాలిస్తున్నారు.

అది వూళ్ళోకి జొరబడుతుందని ప్రతీ వీధిలోను సాయుధులైన పోలీసులు కాపలా కాస్తున్నారు. తడవ తడవకు నాలుగు పోలీసు జీపులు వూరంతా తిరుగుతున్నాయి.

కాలేజీలు, స్కూళ్ళు, మూసేశారు.

ఆఫీసులు కూడా చాలావరకు తెరవబడలేదు.

ఊళ్ళో దుకాణాలు చాలామట్టుకు మూసి వేయబడ్డాయి.

దామోదర్ కు ఈ విషయం తెలిసి కూడ అతను పెద్దగా పట్టించుకోలేదు.

అతను ఆ రోజు షాపు తెరుద్దామనుకున్నాడు.

గేరేజ్ లోంచి జీపు బయటకు తీస్తుండగా తానూ వస్తానని మారాం చేశాడు రాజు.

“నువ్వు రావొద్దు! బాబూ! ఈరోజు నీకు కాన్వెంట్

లేదుగా! హాయిగా యింట్లో కూర్చుని ఆడుకో! వచ్చే టప్పుడు నీకు బొమ్మలు, చాక్లెట్లు తెస్తాన్లే!" అన్నాడు.

"నా కవేమీ వద్దు డాడీ! నీతోపాటు నేనూ వస్తాను. నన్ను తీసుకెళ్ళు" అంటూ మంకుపట్టు పట్టాడు.

ఇక దామోదర్ కు కూడా తీసుకువెళ్ళక తప్పలేదు.

"సరే రా" అంటూ రాజుని జీవ్ ఎక్కమన్నాడు.

జీప్ దామోదర్ టెక్స్టైల్ షాపు ముందు ఆగింది.

దామోదర్ షాపు తెరిచి కేష్ బాక్స్ ముందు కూర్చున్నాడు. రాజు పక్కనే వున్న మరో కుర్చీలో కూర్చున్నాడు. మరో ఐదు నిముషాలు గడిచాక ___

ఆ షాపు మేనేజరు, మరో యిద్దరు సేల్స్ మెన్ మాత్రమే పనికి హాజరయారు. మిగతా సేల్స్ మెన్ పనికి హాజరు కాలేదు, పులి భయంవల్ల.

దామోదర్ లాగే పులి గురించి పట్టించుకోని మరి కొందరు యజమానులు తమ దుకాణాలని కూడా తెరిచారు.

రోడ్లమీద జనం పలచగా తిరుగుతున్నారు.

తెరిచివున్న కొద్దిపాటి దుకాణాలలో షాపింగ్ కూడ ఏమంత రద్దీగా జరగడం లేదు.

ఆ సమయంలో దామోదర్ టెక్స్టైల్ వున్న వీధి చివర దూరంగా పోలీసుల ఈలల శబ్దాలతోపాటు జీపు మోతలు....

ఆ వెనువెంటనే రివాల్వర్లు మోగిన చప్పుడు....

ఆ వెనుకనే "గాండ్రు....గాండ్రు" మంటున్న పులి అరుపులు....

ఒకదాని వెనుక ఒకటి గందరగోళంగా వినిపించ

సాగాయి.

రోడ్డుమీద పలచగా వున్న జనం భయవిహ్వలులై అటూ ఇటూ పరుగెత్తసాగారు.

రివాల్వర్ బులెట్లు పక్కనుంచి దూసుకుపోతూంటే నల్లచిరుత పరుగుపెడుతూ దామోదర్ షాపులోకి ప్రవేశించింది.

షాపులో వున్నవాళ్ళంతా కొయ్యబారిపోయారు. కాళ్ళు గజగజ వణుకుతున్నాయి.

అది షాపులోకి ప్రవేశిస్తూనే ఎదురుగా వున్న దామోదర్ మీదికి పంజాతో దుముకబోయింది.

అంతే!

దామోదర్ తన పని అయిపోయిందనే అనుకున్నాడు.

కాని—

కన్నుమూసి తెరిచేలోగా మరో విచిత్రం జరిగింది.

తండ్రి పక్కన కూర్చున్న రాజా చిరుతమీదికి చెంగున ఒక్క గెంతు గెంతాడు. దాని పంజాని చేత్తో పట్టుకుని వెనక్కి విసురుగా తోసేశాడు.

ఆ విసురుకు అది రెండు గజాలదూరం వెనక్కి వెళ్ళింది.

మళ్ళా గాండ్రుమంటూ రాజామీదికి ఉరికింది.

ఆ బాలుడు దాని రెండు కాళ్ళని ఒడిసిపట్టుకుని గిరగిరా తిప్పాడు. అది నోటితో రాజా ముఖాన్ని పట్టుకోబోయింది. కానీ రాజా లాఘవంగా దాని నోటికి దొరక్కుండా రెండు చేతులతో దాని మెడ గట్టిగా పట్టుకుని కిందకి వేలాడాడు.

ఆ పట్టుకి పులి ఎటూ కదలలేకపోయింది.

గిల గిలా గింజుకో సాగింది.

ఎటూ కదలలేక "గాండ్రు గాండ్రు" మని అరుస్తూ అచేతనంగా వుండిపోయింది.

పోలీసులు లోపలికి అడుగు పెట్టారు.

ఆ దృశ్యం చూసి నిశ్చేష్టులయ్యారు.

ఇక షాపులో వున్నవాళ్ళలో అసలు చలనమే లేదు. కళ్ళు తేలవేసి అలాగే చూస్తూండిపోయారు.

ఓ క్షణం తరువాత అంతా తేరుకున్నారు.

రాజు ఆ పులిని గట్టిగా పట్టుకుని వుండగా, మరో నలుగురైదుగురు కానిస్టేబుల్స్ దాని కాళ్ళు గట్టిగా తాళ్ళతో కట్టేశారు.

పులి నిస్సహాయంగా "గాండ్రు గాండ్రు" మంటూ ఇంకా అరుస్తూనే వుంది.

దానిని మోసుకెళ్ళి వాన్‌లో పడేశారు.

ఇన్‌స్పెక్టర్ రాజుకి షేక్‌హాండిచ్చాడు.

"బాబూ! ఇంత భయంకరమైన పులిని నువ్వొక్కడివే ఎలా పట్టుకుని ఆపగలిగావ్? నీకు భయం కలగలేదా?" భుజం తడుతూ అడిగాడు ఇన్‌స్పెక్టర్. అతనింకా ఆశ్చర్యంలోంచి తేరుకోలేదు.

ఆరేళ్ళ బాలుడు ఓ పులిని ఒంటరిగా ఎదుర్కొన్నాడంటే ఎవ్వరూ నమ్మరు. కాని, అది వాళ్ళ కళ్ళెదురుగానే జరిగిన దృశ్యం. నమ్మక తప్పడంలేదు.

"భయం దేనికి సార్!? మా టీచర్ స్కూల్లో టార్జాన్ కథలెన్నో చెప్పారు. టార్జాన్ సినిమాలు కూడ డాడీ నాకు చూపించారు. అందుకే ఆ పులిని చూడగానే టార్జాన్‌లా దాంతో దెబ్బలాడాలనిపించింది. అంతే! పులిని పట్టుకున్నాను వెంటనే" అంటూ నవ్వుతూ

చెప్పాడు రాజు.

"వెరీగుడ్! బ్రేవో మై బాయ్" అని భుజం తట్టాడు ఇన్‌స్పెక్టర్.

పక్కనేవున్న పోలీసు ఫోటోగ్రాఫరు రాజు ఫోటోని కెమేరాలో బంధించాడు.

దామోదర్ కొడుకువంక కృతజ్ఞతగాను, ప్రేమగాను చూస్తూండిపోయాడు.

ఆ వాడు తను టీచర్ కి వార్నింగివ్వడం గుర్తొచ్చింది. నిజంగా టీచర్ అలాంటి సాహస కథలు చెప్పబట్టే ఈ వాడు ధైర్యంగా తన కొడుకు పులితో దెబ్బలాడి తన ప్రాణాలు కాపాడాడు.

'అవును. టీచర్లు పిల్లలకు సాహసోపేతమైన కథలు తప్పకుండా చెప్పాలి. ఆ కథలు విని రాజులా ప్రతీ పిల్లవాడు ఓ టార్జాన్ కావాలి' అని అనుకున్నాడు మనసులో.

ఆ మర్నాడు 'బాలుని సాహసం' అనే హెడ్డింగుతో రాజుని ప్రశంసిస్తూ పేపర్లో రాజు ఫోటో పడింది.

ఆ వూరి కలెక్టరు గారు స్కూలులో చిన్న మీటింగు యేర్పాటు చేసి రాజుకి ఐదువందల రూపాయలు బహుమానంతో పాటు ఒక గోల్డు రింగు కూడా ప్రెజెంట్ చేశారు. ఆ మొత్తం జూ అధికారుల ద్వారా రాజుకి ఇప్పించబడింది.

(ముగింపు వచ్చే సంచికలో)